# 1984 లో ఓ రోజు కథ



## పెళ్లకూరు జయప్రద

"ఇదిగో ఇన్ని మాటలులేదు. మూడు రూపాయలిస్తా ఆరు వంకాయలు ఇస్తే ఇవ్వు లేకపోతే చక్కా లేచి వెళ్ళిపో."


అరగంట క్రితం కూరలమ్మి తలుపు తట్టిన చప్పుడుకు మేల్కొన్న నేను - ఈ అరగంటలో మా శ్రీమతి నోటి వెంట ఆ మాట అరడజను సార్లన్నా వినుంటాను. ఆ కూరలమ్మి ధర తగ్గించదు, లేచి వెళ్ళదు. మా ఆవిడ తనపంతం వదలదు. ఆసమస్యా పరిష్కారానికి ఇంతవరకు ఎదురుచూసిన నేను, ఇక ఎదురుచూచే ఓపికలేక తల మీదుగా ముసుగు తన్నేసి రెండో నిద్ర కుపక్రమించాను.

"అదేంటే చంటిబిడ్డకు పాలు మరీ అంత పల్చగా ఇస్తున్నావ్. అసలవి పాలా? నీళ్ళా? ఎన్ని నీళ్ళు కలిపావేమిటి?"

"లేదత్తయ్యా. రామస్వామి పోసిందే అంత. నేను నీళ్ళు కలపనేలేదు."

అత్తగారి గదమాయింపూ, కోడలి సంజాయిషీ లీలగా వినిపిస్తూనే వున్నాయి.

"అవును వదినా! చీప్గా లీటరు పది రూపాయలకే పోస్తున్నాడని అందరూ




రామస్వామి పాలమీద కెగబడితిరి—మరి వాడు మాత్రం పాలు ఉత్పత్తి చేయలేదు కదా! ఈరోజు మరో క్రొత్తబేరం తగిలుంటుంది. ఎవరినీ నిరాశపర్చడం యిష్టంలేని వాడు మునిసిపాలిటీ కుళాయిని ఆశ్రయించుంటాడు."

మా ఆఖరి సుపుత్రుడు రంగంలోకొచ్చి వట్టున్నాడు. వాడికి రోజూ నీళ్ళపాలందుతున్నాయని వాడి అక్కసు వాడిది.

ఆ తర్వాత స్పష్టంగా వివాదాలు, వాగ్యుద్ధాలు లాటివి కాకపోయినా, శ్రీమతి గొణుగుడు కోడలి గాజులు చప్పుడు, మాత్రం కాసేపు వినిపించి ఆ తర్వాత అంతా నిశ్శబ్దమయిపోయింది.

లేచి బ్రష్ చేసుకుని కాఫీ కొరకు వంటింట్లోకి అడుగుబెట్టిన నాకు మహాద్భుతమూ, అతి కమనీయమూ అయిన దృశ్యం కంటబడింది. ఒకే ఒక్క బీరకాయను రెండు కూరలుగా చేయాలని వాళ్ళ తాపత్రయం.

"మరీ కండంతా తొక్కలో వదిలేశావే కూరెలా పరిపోతుంది!" అంటోంది నా శ్రీమతి.

"మరీ ఈ నాలుగు తొక్కలు బండ మీద వేస్తే బండ కంటుకుపోతుందని, మరికాస్త కండ అందులో వుంచేశానత్తయ్యా." అని తన పచ్చడాభిమానాన్ని వెలిబుచ్చుతోంది నా కోడలు.

"అయినా ఇదెలా కూర చేయనే!" అని బేలగా తరిగిన ముక్కలవైపు చూస్తున్న అత్తగారికి మరలా తనే సలహా ఇచ్చింది.

"శనగపప్పు కలిపి వండేద్దాంలే అత్తయ్యా."

"సరే. ఫో. లేచి ఓ పాతిక పప్పులు తీసుకురా." ఇదొక వింత భాష, ఎప్పుడైనా కె. జి, అరకేజీలాటివి వినడమేగాని, శనగపప్పును—పాతిక పప్పులనడం—జీడిపప్పు లాగ, ఇదే వినడం. పెళ్ళయినప్పటినుండి, ఉద్యోగార్థం కొడుకు, కోడలు విజయవాడలో వుండిపోవడంలో, కూతుళ్ళంతా పెళ్ళయి వెళ్ళిపోవడంతో, మా శ్రీమతికి నోటిమాట చెప్పుకోవడానికి

మం ఆడతడు ఇంట్లో లేని మూలంగా, ఇలాంటి సంభాషణలు వినే భాగ్యం నాకింతవరకు కలగలేదు. ఆ పప్పుల లెక్కేమిటో తెలుసుకోవాలనే కుతూహలం కలిగినా, అలా అడిగి,

"మీకేం మగమహారాజులు. ముష్టి వెయ్యి రూపాయలు, తెచ్చి నా ముఖాన కొట్టి కాలు మీద కాలేసుకుని దర్జాగా కూర్చుంటారు. ఆ నాలుగురాళ్ళతో ఈ సంసారాన్ని ఎలా ఈదుతున్నానో, ఆ భగవంతుడికే తెలియాలి. ఇంకో ఐదువందలన్నా ఇవ్వండే ఈ ఇంటి ఖర్చులతో నేను యుద్ధం చేయలేను" అని ఝాడిస్తే-అదీ కోడలిముందు. వినే సాహసంలేక నా కోరికను చంపుకున్నాను.

"నాకు కాస్త కాఫీ ఇస్తావా లక్ష్మీ." వేడికోలుగా అడిగాను. రోజూ పొద్దున్నే శ్రీమతి శ్రీ నరసింహావతారం ఎత్తేస్తుంది. కళ్ళు తెరిచాక కూరగాయలమ్మి దగ్గర నుండి కూర తయారయి. నన్ను ఆఫీసుకు పంపేదాకా ఆమెకు అన్నీ సమస్యలుగానే వుంటాయి. ఆ విషయం బాగా తెలిసిన నేను పది గంటలవరకు కాస్త జాగ్రత్తగా మాటలు వాడుతుంటాను.

"కాఫీపొడి నిన్నటితో అయిపోయిందండీ. కాస్త పని పిల్లకు, మీ జేబులో చిల్లరుంటే రెండు రూపాయలిచ్చి, ఓ కప్పు కాఫీ తెప్పించుకోండి."

"అదికాదే! నీ చేతుల్తో కాఫీ చేస్తే అమృతంలా వుంటుందనీ!" కాస్త ఉబ్బించబోయాను. "గయ్"మంది చేతులు తిప్పుతూ.

"ఈ నెలాఖరు రోజుల్లో ఎక్కడనుండి తెస్తారో యాభై రూపాయలు తెచ్చి, కాఫీ పొట్లాం పట్టండి. అమృతం కాచిస్తాను"

"యాభై రూపాయలా? అయితే అమృతం వద్దులే. కాఫీయే. తాగుతాను"

ఈరోజు ఏదోపండగ కాబోలు (పండగ చేసుకోవాల్సి వస్తుందని భయపడి, పండగ రోజులు గుర్తు పెట్టుకోవడం మానేసిచాలా రోజులయింది) పెలవిచ్చారు. తిరిగ్గా నేను

# వృక్షాలూ - నక్షత్రాలూ

లక్ష నక్షత్రాలతో
మెరిసే
గగనాన్ని చూసి
లక్ష హరితపత్రాలతో
మెరిసే
వృక్షాలు నవ్వుతాయి

గగనాన్ని ఆక్రమించాలన్న
భూజాల జిగీష
అంతరించదు, తరించదు

పరచుకొన్న ఆకాశంనిండా
విరిసిన తారాపహస్త్రాలు....
పాదపాల మస్తకాలనిండా
పరిమళించే సుమస్తబకాలు....

వృక్షాలకు మస్తిష్కాలుంటే
శూన్య గగనంతో వ్యర్థసమరానికి
కాళ్ళు దువ్వకపోను,
రాళ్లు రువ్వకపోను

[చెట్లకు మెదడే ఉంటే
ఔన్నత్యానికి అర్రులుసాచని
నేలబారు నీచజాతిగా
పాకుతూ నైచ్యాలను పాకుతూ!]

వృక్షాలకైనా నక్షత్రాలకైనా
స్పర్థ అభివృద్ధికి లిప్త....

— సోమసుందర్

గుమాస్తాగావున్న రోజులలో కొనుక్కున్న పాత సోఫాలో వెనక్కి వాలి, శాస్త్రీయ సంగీత మేమయినా విన్పిస్తుందేమోనని రేడియో ట్యూన్ చేశాను.

"గవర్నమెంటువారు రైతుల యెడల అతిశ్రద్ధ తీసుకుని, వారికి అందుబాటులో వుండేలాగున, రసాయనపు ఎరువులను తమ అధీనం చేసుకున్నారు. కావున రైతులందరూ ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుని రెట్టింపు పంటను పొందండి, దేశాన్ని సస్యశ్యామలం చేయండి."

"వెధవగోల"—రేడియో కట్టేశాను.

"అదేంటి నాన్నా ఎరువులు దొరకడం లేదనికదూ మొన్న అన్నయ్యతో అంటున్నావు!" మా చిన్నాడి సందేహం.

దొరుకుతాయిరా నాన్నా. నువ్వు పండించబోయే ధాన్యంకంటె రెట్టింపు. ధర నువ్వు పెట్టగలిగితే-భూ గృహాల్లోనుండి బయటకొస్తాయిరా-" నేను చెప్పింది వాడికి బొత్తిగా అర్థం కాలేదని, వాడి వెర్రి ముఖమే చెప్తోంది."

"కృష్ణా!" వంటింట్లోనుండి మావాడికి టెలిఫోన్.

"వస్తున్నా వదినా! నాన్నా మిమ్మల్ని డిగి ఐదు రూపాయలు తీసుకుని వదిన వారపత్రిక తీసుకురమ్మంది."

నా జేబులో అయిదు రూపాయలతో వాడు మాయం కాగానే ఆ రేశ్కి నా మనవరాలు ప్రత్యక్షమయింది.

"తాతయ్యా! తాతయ్యా, నాకు కాస్త సిమెంటు తెచ్చిపెట్టవూ! మరేం పక్కింటి వారిజ దగ్గర సిమెంటు బుడ్లు ఎంత బాగున్నాయనుకున్నావ్! నేనుకూడా తయారు చేసుకుంటా తాతయ్యా!"

"అరెరె సిమ్మెంటా అదెలా వుంటుందే అమ్మలూ! నువ్వు పుట్టాక అలాటి పదార్థం చూసినట్టు నాకు గుర్తులేదే! బహుశ నాకు కన్పించకుండా అది ఎక్కడో చీకట్లో దాక్కునుంటుందే బుజ్జీ."

"ఖా తాతయ్యా-నువ్వెప్పుడూ ఇంతే."

"బీరకాయ పచ్చడి చేశాను. బీరకాయ పప్పుకూర వండాను. చారు పెట్టాను. మజ్జిగుంది. నంజుకోవడానికి ఏమి తెప్పించమంటారో చెప్పండి. ఇంట్లో ఏం లేదు."

'కోడిగుడ్డు' అందామనుకుని ఉదయపు వేడి గుర్తుకొచ్చి బుద్ధిమంతుడిలా-

"అప్పడాలయితే చీప్‌గా వస్తాయనుకుంటానేం! తలా ఒక అప్పడం తెప్పించెయ్, ఆరుగురికీ ఆరప్పడాలు నూటిరవై పైసలకొచ్చేస్తాయ్‌కదూ లక్ష్మీ!" అన్నాను.

"ఉష్!" అని పెరటిద్వారం వైపు చూపిస్తూ, నా వాగ్ధాటిని నివారించింది శ్రీమతి.

"మీరు భలేవారే! వాళ్ళు ధరలు పెంచకముందేమీరుపెంచేట్టున్నారు. అది అప్పడం పదిహేను పైసలకే ఇస్తుంది. అదక్కడ నిల్చొంది. విన్నదంటే, రేపొద్దున్నవచ్చి "అప్పడం ఐదు పైసలు పెంచారమ్మా" అంటుంది అప్పడం ధరకూడా ఇందిరాగాంధీయే పెంచినట్టూ, ఇది ఉట్టి అమాయకురాలైనట్టూ. అయినా "కాటన్ మార్కెట్టు" లాగా మన మార్కెట్టూ పూటకి ఒక ధర అయిపోయిందేవిటండీ!"

నా అన్నం ప్లేట్లో అప్పడానికి బదులు కోడిగుడ్డు ప్రత్యక్ష మయింది. "మూడు రూపాయలు పెట్టి ఈ నెలాఖరులో కోడిగుడ్డెందుకు కొన్నావే లక్ష్మి అప్పడంతో తినేసేవాళ్ళంగా."

నా భార్య దగ్గర నుండి సానుభూతి సంపాయించడానికి దొరికిన ఈ సదవకాశాన్ని నేను వృధాపోనీ దల్చుకోలేదు.

"మీకూ, మీ సుపుత్రుడికీ అది లేందే ముద్ద దిగుతుందా? రేపొద్దున గుడ్డు నాలుగురూపాయలయినా నాకుతప్పుతుందా? అయినా అప్పడం అయితే మాత్రం గుటుక్ గుటుక్ మని మింగనూ? మానె ధరెంతో మీకు తెలుసా అసలు?"

ఈరోజు మా శ్రీమతి ఉంపంచిం తగ్గేలా లేదు. ఆ వేడిలో అది మాడిపోతుం దని భయపడి చిన్న జోక్ విసిరాను.

"అయితే ఈ రోజు మీ అత్తాకోడళ్ళకు రెండేసి అప్పడాలు దక్కాయన్న మాట."

"అంత్ర — అన్నీ మేమే మింగేస్తే రాత్రికి ముద్ద డగొద్దూ మీకూ!"

తన మాటల్లోని కటుత్వాన్నీ, వాటి వెనక — మాపట్ల వుండే మార్దవాన్నీ తలుచుకుంటూ, భగభగమండుతున్న దాన్నే చూస్తున్నాను. నా బావమరిది కూతురైనా నా దగ్గర అంతగా చనువులేదు. కోడలు, తలుపు చాటు నుండి, ఈ సినిమా అంతా గమనిస్తూనే వుంది.

నా అన్నం కంచె, బీరకాయ కూర కంచె ముందు నా కోడిగుడ్డు అయిపోయి కూర్చుంది. ఇక మిగిలిన అన్నం గొంతులోకి పోవడానికి సమ్మె చేసింది. మెల్లగా ప్లేటుదగ్గరనుండి లేవబోయాను. కోప్పడుతుందేమోనని అనుమానిస్తున్న నాకు చిత్రంగా ఆమె కళ్ళ తడి అవడం కన్పించింది.

పాపిష్టిదాన్ని మీకు సరిగా తిండికూడా పెట్టలేకపోతున్నాను. ప్రొద్దస్తమానం ఆఫీసులో చాకిరీ చేయాలి."

ఆ ఆర్ద్రతలో నేను కరిగిపోయాను. మానసికంగా పసిపాపనై తన ఒడిలో ఒదిగిపోయాను.

ఈ పాపిష్టి జన్మకు చావైనా రాదు. ఈ ధరలేమో రోజురోజుకీ మండిపోతూనే వుంటాయి. ఇక నాలుగు రోజులుపోతే ఈ మాత్రం అయినా మీకు చేసిపెట్ట గలుగుతానో లేదో! మిమ్మల్ని ఉపవాసం వుంచేరోజు రాకముందే నన్ను కడతీర్చరా అని దేవుణ్ణి కోరుకోని రోజులేదు." ఆమె కళ్ళు నిండుకున్నాయి. ఆమె కంఠం పూడిపోయింది.

పొద్దుటినుంచి అది ఏమన్నా, నేను నవ్వుతాలుగా తీసుకున్నాను. దాని విసుగును పట్టించుకోలేదు. కానీ తన విసుగు వెనక దాని సమస్య - దాని వ్యధ అర్థమయిన నేను పశ్చాత్తాపంతో కరిగిపోయాను.

"చూడు లక్ష్మీ. నువ్వు బాధపడకు. నేనింకా సంపాదిస్తాను. ఏదో మార్గం



చూస్తాను. నువ్వు కంట తడిపెడ్తే మాత్రం నేను చూడలేను కళ్ళు తుడుచుకో."

"బాగానే వుంది సంబడం! ఇంకా సంపాయిస్తాడట ఈ వయస్సులో." కొంగుతో ముక్కు తుడుచుకుంటూ లోపలి కెళ్ళబోయింది.

"అదేంటోయ్, వెళ్ళిపోతున్నావ్, నేను ఇంకా తింటాను. నువ్వు వద్దన్న వరకు తినేస్తాను. రా మరీ నువ్వు వచ్చి వడ్డిస్తే కదా!"

"కీ" ఇచ్చినట్టు గబగబ వెనక్కి వచ్చేసింది. నా పేట్లో మరింత అన్నం వడ్డించి "చారు పోయనా!" అంది. చారుపోసుకుని, ముద నోట్లో పెట్టుకున్న నాకు, "అంతా తినేస్తా"నని ముందుగా ప్రతిజ్ఞ చేయడం పొరపాటయిందనిపించింది. చారులో పొత్తిగా కాకపోయినా, అసలు ఉప్పులేనట్టే లెక్క. నా శ్రీమతి నా అవస్థ అప్పుడే గమనించినట్టుంది నాతో పాతికేళ్ళ సర్వీసు మరి.

"కాస్త ఉప్పు తక్కువయిందికదూ!" అంది మెత్తగా. అవునన్నట్టు తలూపాను.

"పర్వాలేదు. ఇప్పుడుకలిపేసుకుంటాగా కాస్త పట్రా"

లేదండీ. రేషన్‌కార్డుమీద తీసుకున్న ఉప్పు ఈ రోజుటితో అయిపోయింది. బ్లాక్‌లో ఒక శేరు తెమ్మని రెండు రూపాయలిస్తే, దొరకలేదనొచ్చాడు"

పరవాలేదు. పరవాలేదు. తినేస్తున్నాగా!"

ఆ రోజు సినిమా చూడాలని కోరిక కలిగింది శ్రీమతికి. మేము సినిమా చూచికూడా మూడు నెలలు కావస్తోంది. మా ఇంటికీ సినిమా హాలుకీ ఫర్లాంగు దూరం. రిక్షాకి రెండు రూపాయలిచ్చుకోపడానికి నా జేబు ఒప్పుకోక నడక ప్రారంభించాం.

ఒక బట్టల దుకాణం "షోకేస్" దగ్గర ఆగిపోంది లక్ష్మి ఆ షోకేస్‌లో అందమైన బొమ్మ, ఆ బొమ్మకి కట్టిన అందమైన చీర, ఆ చీరనే చూస్తున్న అందమైన నా శ్రీమతి నేత్ర ద్వయం— వాటినే మార్చి మార్చి చూస్తున్న నతో.

అలాటి చీర మన పెళ్ళయిన కొత్తలో మీరు కొనిచ్చారు గుర్తుందా! మరలా అది ఫ్యాషనయింది కాబోలు!" అనేసినా జవాబు కెదురు చూడకుండా బొమ్మకు దగ్గరగా నడిచింది.

మన పెళ్ళయిన కొత్తలోనే నయం. అడపా దడపా ఒక్క పట్టుచీరన్నా కొనిచ్చేవారు ఇప్పుడు కళ్ళచూద్దామన్నా పట్టుచీర లేదు" అలా నన్ను ఉడికించబోతున్న శ్రీమతి స్వరం వున్నట్టుండి వలచబడిపోయింది. కళ్ళు కుంచించుకుపోయాయి.

"అదేమిటండీ. దానిమీద ఆరువందలా పాతిక వేసుందీ! అప్పుడు మనం నలభై కనుకుంటూనూ అది కొనింది! .. "

"అవునులే అన్నీ పెరిగిపోయాయిగా మరీ! (స్వగతం) అన్నట్టూ అప్పుడు మీ జీతమెంతండీ!"

"రెండువందల చిల్లర"

అయితే ఈ చీరతోపాటు మీ జీతం .."

వెండి తెరమీద బొమ్మలు కదిలిపోతున్నాయి. అందులో హీరో, స్వశక్తిమీద పైకొచ్చిన ఒక గవర్నమెంటు డక్టరు. అతను బీదరోగుల సేవార్థం ఎక్కువ కాలం హాస్పిటల్‌లోనే గడుపుతుంటాడు. అంతవరకు బాగానే వుంది. మరో సెట్టులో అతనిలు. అది ఇల్లుకాదు ఇంద్ర భవనం— కాంపౌండ్ లోపలే రోడ్లు. నిగనిగ మెరిసేకారు. పిలిస్తే పలికే నౌకర్లు. కేవలం ఆరు వందల రూపాయల గవర్నమెంటు జీతగాడు, ప్రయివేట్ ప్రాక్టీస్ లేని ఆ డకర్‌కి ఆ ఇల్లూ. ఆ కారు ఎలా వచ్చిందో భగవంతుడికే తెలియాలి. నాకు విసుగొచ్చేసరికి హీరోగారు సిల్కు తెరలు కట్టిన డబల్ "కాట్" మీద "సింగిల్"గా అలసి నిద్ర పోతున్నాడు. శ్రీమతితో చెప్పి లేచి బయటకెళ్ళి చల్లగాలి పీల్చుకుందామని ప్రక్కకు తిరిగాను.

ఆమె సినిమాలో పూర్తిగా లీనమైపోయింది! పెరిగిన వంకాయల ధరగానీ, రేపు పెరగబోయే సబ్బు ధరగానీ, ఆమె

[illegible] తన భ్రాంతింగాని అవేమీ ఆమెకా క్షణంలో గుర్తున్నట్టు లేదు. ఆ మూడు గంటలసేపయినా వాస్తవాన్ని మరిచి కలలాటి కథలో లీనమై పోయిన. ఆమె ఆనందాన్ని చెరిచేయడం ఇష్టంలేక మౌనంగాలేచిబయటికొచ్చేశాను.

గేటు బయటకు రాగానే చుక్కరటి పండ్లు ఎదురొచ్చాయి. ఏమీ తోచని నేను వాడితో బేరం మొదలెట్టాను.

"ఒక్క పండు ఎంతయ్యా!"

"రూపాయండి సార్. చాలా తియ్యగా వుంటాయి సార్"

"అదేంటోయ్ నిన్ననేగా తొంభై పైసలకు కొన్నాను"

"కదా సార్ అది!" అని తన జోక్‌కు తనే నవ్వుతున్న వాడి నవ్వు భరించలేక "సరే రెండివ్వు" అనేసి రెండు రూపాయలు సమర్పించి పళ్లు అందుకుని హాల్లోకి మరలా అడుగుపెట్టాను.

ఇప్పుడు వెండితెరమీద డాక్టరుగారి సతీమణి. చంటిపాపకు బంగారు ఉగ్గుగిన్నెలో ఉగ్గు కాబోలు పడ్తోంది. ఆమె చెలికత్తెలు కాబోలు ఆ బంగారు ఉగ్గుగిన్నెను, పాపడి బంగారు మేనిఛాయను పోలుస్తూ పాట పాడుతున్నారు.

నాకు పెదసందేహంవచ్చింది. ఇప్పుడు సవరు బంగారు ఖరీదెక్కువా? డాక్టరుగారి నెలజీత మెక్కువా? ★

# అంకెల ఆనవాళ్ళు

మొదట రోమనులు అంకెలను వ్రేళ్ళ సహాయంతో గుర్తించసాగారు. ఒక్కొక్క అంకెకు ఒక్కొక్క నిలువు గీత గీసేవాళ్ళు. ఈ పద్ధతిలో పెద్ద అంకెలను గుర్తించడం చాలా కష్టమైంది. కాబట్టి వాళ్లు కొన్ని పద్ధతు లవలంబించారు.

మూడు అంకెలవరకూ మూడు నిలువు గీతల్ని గీశారు. అయిదుకు చేతి నాలుగు వ్రేళ్ళను ఒకటిగాను, బొటన వేలిని ఒకటిగాను చాచి ఆ గుర్తును (V) వుంచారు. ఈ గుర్తుకు ఎడమవైపు మైనస్ అర్థంలో ఒక్క నిలువు గీత వుంచి (IV) నాలుగు అనే గుర్తును ఏర్పరచారు. దానికి కుడివైపు గీసిన నిలువు గీతల్ని ప్లస్‌గా గుర్తించారు. ఇలా అయిదు (V) మీద మూడు నిలువు గీతలు చేర్చిన ఎనిమిది (VIII) అయింది. పదికి యిలాంటి V గుర్తుల్ని రెంటిని కలిపారు. ఆ కలపడం ఒకదాని క్రిందొకటిగా జరిగింది. దాని యెడమవైపు మైనస్ అర్థంలో ఒక గీత గీశారు. తొమ్మిది అనే అంకె (IX) ఏర్పడింది. ఇలా అంకెలు ఏర్పడ సాగాయి. నూటికి సెంటమ్ (నూరు) అనే అర్థంలో 'C' వేయికి మిల్ (వేయి) అనే అర్థంలో 'M' ఏర్పడ్డాయి. ఏబది 'L' అనే గుర్తుచేత సూచింపబడుతుంది.

—ఏ. ఎస్. నాయుడు, (కొత్త యిండ్లు)